ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 241 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 11 డిసెంబర్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# పంచాయితీ పోరు నేడే

**ఎన్నికల నిర్వహణకు సర్వసిద్ధం**

**తొలి విడతలో మొత్తం 189 మండలాలు**

**4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు**

**రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు**

**గ్రామాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు**

**ఉదయం 7 నుంచి 1 గంటవరకు పోలింగ్**


**మధ్యాహ్నామే ఓట్ల లెక్కింపు... ఫలితం ప్రకటన**

**వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**



**హైదరాబాద్, డిసెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్రంలో తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం అయ్యింది. ఇప్పటికే జోరుగా ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు నేటి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా పంచాయితీ ఎన్నికల్లో పోటీ పెరిగింది. తెలంగాణలో తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్నాయి. హైదరాబాద్‌లో ఎస్ఈసీ రాణి కుముదిని విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి దశ పల్లె పోరుకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7.00 గంటల నుంచి ఈ పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ తొలి దశలో 56,19,430 మంది ఓటర్లు.. తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడించారు. గురువారం జరగనున్న తొలి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగేలా విస్తృత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తొలి విడతలో మొత్తం 189 మండలాలు, 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, తొలి విడతలో 56,19,430 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కోనున్నారు. వీరిలో 27,41,070 మంది పురుషులు, 28,78,159 మంది మహిళలు, 201 మంది ఇతరులు ఉన్నారు. తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ. 8.2 కోట్లు సీజ్ చేశామని వివరించారు. 50వేల మంది సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని ఎస్ఈసీ తెలిపారు.ఎన్నికల నిర్వహణ కోసం సుమారు లక్ష మంది ఎన్నికల సిబ్బందిని నియమించామని కమిషనర్ తెలిపారు. ఇందులో 3,591 మంది రిటర్నింగ్ అధికారులు, 93,905 మంది పోలింగ్ సిబ్బంది ఉన్నారు. అలాగే ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు 2,489 మైక్రో అబ్జర్వర్లను నియమించారు. పారదర్శకత కోసం 3,461 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 45,086 బ్యాలెట్ బాక్సులు వినియోగించనున్నారు. ఓటర్ సౌలభ్యం దృష్ట్యా 99 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయ్యిందని కమిషనర్ వెల్లడించారు. మిగతా ఓటర్లు 'టీఎస్ ఈ-పోల్ మొబైల్ యాప్' ద్వారా కూడా తమ ఓటర్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే ఓటింగ్ కేంద్రం తెలుసుకునేందుకు అదే యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఇప్పటివరకు 3,214 ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా.. 31,428 మందిని బైండోవర్ చేసినట్లు, 902 లైసెన్స్డ్ ఆయుధాల డిపాజిట్, రూ. 7.54 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహాల స్వాధీనం చేసినట్లు రాణి కుముదిని వెల్లడించారు. నిన్న సాయంత్రం నుంచే మద్యం దుకాణాలు మూసివేశామని ఆమె తెలిపారు. భద్రతా చర్యలలో భాగంగా 31 జిల్లాల అధికారులకు మేజిస్ట్రేట్ పవర్స్ ఇచ్చామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. ఎన్నికల ప్రచారం కూడా మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ, భయభ్రాంతులు లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య బలోపేతంలో ఓటు కీలకమని పేర్కొంటూ, గ్రామాల భవిష్యత్తు నిర్ణయంలో ఓటు శక్తిని గుర్తించాలని ఆమె అన్నారు. అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో ఈ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల విధుల్లో లక్ష మందికి పైగా సిబ్బంది పాల్గొనున్నారని వివరించారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు 18 రకాల ఐడి కార్డులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏ రకమైన ఐడి కార్డును పోలింగ్ బూత్ అధికారులకు చూపించిన ఓటు వేయవచ్చునన్నారు. ఇక మంగవారం నుంచి ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వైన్ షాపులన్నీ మూసి వేసినట్లు చెప్పారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు మేజిస్ట్రియల్ పవర్స్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈసీ వివరించారు. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారని చెప్పారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందన్నారు.




## ఉస్మానియా వర్సిటీకి వెయ్యి కోట్లు

**వెంటనే విడుదలకు విద్యాశాఖ ఉత్తర్వులు**

**అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధికి కంకణం**

**తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియాదే కీలకం**

**ధైర్యంతో కాదు...గుండెనిండా ప్రేమతో ఇక్కడికి వచ్చా**

**చదువు రాకున్నా..చదువు విలువ తెలిసినోడిని**

**ఉస్మానియా సభలో సిఎం రేవంత్ భావోద్వేగ ప్రసంగం**

**హైదరాబాద్, డిసెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే సంకల్పంతో వచ్చానని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ తొలి,మలి దశ ఉద్యమాలకు ఉస్మానియానే కేంద్రమని అన్నారు. ఎన్నో ఉద్యమాలకు ఇది వేదికగా నిలిచిందన్నారు. ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణలో అనేక పోరాటాలు వచ్చాయి. నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది. సామాన్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య.. దొరలపై పోరాడారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఉద్యమాన్ని ఉస్మానియా నుంచే విద్యార్థులు ప్రారంభించారు. గతంలో ఈ వేదిక నుంచే స్వరాష్ట్ర ఆకాంక్షను విద్యార్థులు బలంగా వినిపించారు. పోరాడి సాధించిన రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా.. లేదా.. అని ఇక్కడే తెలుసుకోవాలని అనుకున్నానని అన్నారు. బుధవారం ఉస్మానియా వర్సిటీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓయూకు రూ. 1000 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. ఈ నిధులను విద్యార్థులకు అంకితం చేశారు. అలాగే, ఓయూ అభివృద్ధికి రూ. 45 లక్షల చెక్కు పూర్వ విద్యార్థులు అందజేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ భవనం దగ్గర 'సర్వం సిద్ధం' పేరుతో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా ఉస్మానియా యూనివర్సిటీ వినిపించిందని తెలిపారు. భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించడానికి ఓయూకు వచ్చానని వివరించారు. గతంలో ముఖ్యమంత్రులను అడ్డుకున్న చరిత్ర ఉందని ప్రస్తావించారు. మీరు ఎందుకు ఓయూకు వెళ్లే ధైర్యం చేస్తున్నారని




## స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు వేల కోట్లు

**సమిష్టి కృషికి ఇదో పెద్ద నిదర్శనం**

**గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్**

**హైదరాబాద్, డిసెంబర్ 10 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్‌లో ఉన్న అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మీరు యువకులు, శక్తివంతులు.. సాధారణంగా మీరు మీ కలలను సాకారం చేసుకోవాలనుకుంటారని పేర్కొన్నారు. బుధవారం టీ హబ్‌లో గూగుల్ స్టార్టప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రూ.వేల కోట్లు కేటాయిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. మూడు దశాబ్దాల క్రితం స్టార్టప్‌గా ప్రస్థానం ప్రారంభించిన గూగుల్.. నేడు ప్రపంచస్థాయిలో నిలిచిందని చెప్పారు. ఆ సంస్థను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీహబ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ప్రారంభించారు. హైదరాబాద్‌ను స్టార్టప్‌లకు కేంద్రంగా చేయనున్నట్లు రేవంత్ తెలిపారు. స్టార్టప్‌లు యూనికార్న్ స్థాయికి ఎదిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని కృషి చేయాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించారు. ఉన్నత ఆశయాలతో 1998లో ఇద్దరు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ మిత్రులు ఇద్దరు కలిసి కాలిఫోర్నియాలో ఒక గ్యారేజీలో ఓ స్టార్టప్‌ను ప్రారంభించారని తెలిపారు. అదే నేటి ప్రఖ్యాత గూగుల్ కంపెనీగా అవతరించిందని గుర్తుచేశారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధిని ఆకాంక్షించి ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్‌ను పరిచయం చేయాలని గత రెండు రోజులు, మనం తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించామని వివరించారు. జాతీయ అంతర్జాతీయ కార్పొరేట్ల సమక్షంలో తెలంగాణ భవిష్యత్ కోసం మన విజన్‌ను ఆవిష్కరించామని పేర్కొన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గత 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన అనేక స్టార్టప్స్ నేడు బిలియన్ల డాలర్ల కంపెనీలుగా ఎదిగాయని

..మిగతా 2లో

## హక్కు లేని జీవితం బానిసతో మానం

**ఉర్దూ యూనివర్సిటీ ప్రొపెసర్ నాగేశ్వరావు**




సమావేశం మాట్లాడుతున్న ఉర్దూ యూనివర్సిటీ ప్రొపెసర్ నాగేశ్వరావు



సమావేశానికి హాజరైన విద్యార్థులు

శేరిలింగంపల్లి ,డిశంబర్ 10, (ప్రభాత ఉదయం) బీహెచ్ఈఎల్ టౌన్ షిప్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు మానవహక్కుల దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అవగాహన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జీ. రవీందర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగపు అధిపతి ఆచార్య నాగేశ్వరరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ హక్కు లేని జీవితం బానిసతో సమానం అన్నారు. మానవ హక్కులు అనేవి ఆర్థిక సామాజిక సాంస్కృతిక హక్కులకు ఉద్దేశించినవని తెలిపారు. ప్రపంచంలో పౌర రాజకీయ హక్కులకు సంబంధించి అంతర్జాతీయ ఒడంబడికలపై అవగాహన కల్పించడానికి డిసెంబరు 10వ తేదీన ఒక అంశాన్ని ప్రాతిపదికగా తీసుకుని ఐక్యరాజ్యసమితి మానవహక్కుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరము నిర్వహిస్తుందన్నారు. ఈఏడాది "మానవహక్కులు మన దైనందిన అవసరాలు" అనే నినాదంతో నిర్వహిస్తున్నాలని చెప్పారు. హక్కులనేవి రెండు విధాలుగా ఉంటాయని మొదటిది జన్మతః లభించేది జీవించే హక్కు రెండో వది రాజ్యాంగ పరంగా లభించే హక్కులన్నారు. భూమిపై పుట్టిన ప్రతి మనిషికి స్వతంత్రగా జీవించేదుకు కొన్ని హక్కులు ఉంటాయని కానీ అనేక సందర్భాలలో ఆహక్కులను ఎవరూ గౌరవించడం లేదని వాపోయారు. సాటి మనిషిని కనీసం మనిషిగా కూడా చూడటం లేదని కొన్ని సందర్భాలలో సమాజం కూడా ఈ హక్కులను హరించి వేస్తుందన్నారు. పరువుహత్య జాతి వివక్ష హత్య అత్యాచార ఘటనల వంటివి మనం నిత్యం చూస్తూనే ఉన్నామన్నారు. కొంత మందిలో ఇంకా జాతి భాష ప్రాంత లింగ కుల మత విభేదాల జాడ్యం వీడలేదని వాపోయారు. వీటి వలననే మానవ విలువలు నానాటికి అడుగంటి పోతున్నాయని విచారం వ్యక్తి చేశారు. ఈమధ్య కాలంలో బీద ధనికులనే ఆర్థిక అసమానతల వలన క్రిందిస్థాయి వారిని కించపరచడం జరుగుతుందని చెప్పిన నాగేశ్వరావు హక్కులు లేని జీవితం వ్యర్థమన్నారు. మానవుడు స్వతంత్రంగా జీవించి తన మనుగడను సాగించడానికి ఈ హక్కులు ఉతమిస్తాయన్నారు. 1993లో మానవహక్కుల పరిరక్షణ కోసం ఐక్యరాజ్యసమితి ఒక హై కమీషన్ ను నియమించిందని కేంద్రం ప్రభుత్వం కూడా అక్టోబరు 12వ తేదీన హక్కుల పరిరక్షణకై మానవహక్కుల కమీషన్ ను ఏర్పాటు చేసిందని తలిపారు.ఈ కమీషన్ చట్ట బద్ధమైన స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ కమీషన్ రాజ్యాంగ బద్ధంగా చట్ట బద్ధంగా ప్రజలకు కల్పించిన హక్కుల రక్షణకై బాధ్యతను చేపడుతుందని వివరించారు. కమీషన్ లో ఒక ఛైర్మన్ నలుగురు సభ్యులు ఉంటారని ఛైర్మన్ గా సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తియై ఉండాలని ఒక సభ్యునిగా సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న లేదా పదవీ విరమణ చేసిన వారై ఉండాలన్నారు. మరొక సభ్యుడు ఏదైనా హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తున్న పదవీ విరమణ చేసిన వారై ఉండాలని మిగిలిన యిద్దరు సభ్యులు మానవ హక్కుల రంగంలో పరిజ్ఞానం ఉన్నవారై ఉండాలని చెప్పారు. ఈ సభ్యులతో పాటు మరో నలుగురు సభ్యులుగా ఉంటారు. జాతీయ మానవహక్కుల కమీషన్ ఛైర్మన్ సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు. వీరి నియామకంలో ప్రధానమంత్రి అధ్యక్షతన రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ లోక్ సభ స్పీకర్ రాజ్యసభ లోక్ సభలలోని ప్రతిపక్ష నాయకులు కేంద్ర హెూంశాఖ మంత్రితో కూడిన కమిటీ సలహా యిస్తుందని తెలిపారు. సభ్యుల పదవీకాలం 70 సంవత్సరములు వచ్చేవరకు ఉంటుంది. అవసరమైన సందర్భంలో వీరిని తొలగించే అధికారము రాష్ట్రపతికి మాత్రమే ఉంటుందన్నారు. ఇదే విధంగా రాష్ట్రాలలో కూడా కమీషన్ ఏర్పడుతుంది. వీరిని రాష్ట్ర గవర్నర్ నియమిస్తారు. జాతీయ మానవహక్కుల కమీషన్ యొక్క నియమాలన్నీ వీరికి కూడా వర్తిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ వీ యూనివర్సిటీ ఆచార్య సోమరాజు అధ్యాపకులు మహమ్మద్ యూనస్, సయ్యద్ మక్సూద్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, అమ్మయ్య చౌదరి, జనార్ధన్, పాలం శ్రీను, ప్రేమ్ సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండాపూర్ డివిజన్ మహిళా మోర్చా
# అధ్యక్షురాలుగా సరోజ రెడ్డి నియామకం

శేరిలింగంపల్లి , డిశంబర్ 10, (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడం తోపాటు మహిళల హక్కుల కోసం రాజీలేటి పోరాటం చేయాలని నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ సూచించారు. కొండాపూర్ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో కొండాపూర్ డివిజన్ మహిళా మోర్చా డివిజన్ అధ్యక్షురాలుగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. సరోజ రెడ్డికి నియోజకవర్గ ఇన్చార్జి రవి కుమార్ యాదవ్, రంగారెడ్డి అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్, మహిళా మోర్చా కన్వీనర్ పద్మ, డివిజన్ అధ్యక్షులు అరవింద్, మాజీ అధ్యక్షులు ఆంజనేయులు సాగర్, మహిళా మోర్చా నాయకురాలు మేరీ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మహిళలంతా పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలో మహిళల హక్కుల కోసం మహిళల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తు నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ ఎదుగుదలకు మహిళలంతా కృషి చేయాలని కోరారు.



సరోజ రెడ్డికి నియామకం పత్రాని అందిస్తున్న రవికుమార్ యాదవ్ ఆయన తోపాటు బిజేపీ నాయకులు.

రేపు జరగబోయే జిహెచ్ఎంసి ఎన్నికలలో కూడా మహిళలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యక్ష ఎన్నికల్లో ఎక్కువ మంది పోటీ చేసి అవకాశం కల్పిస్తామని మహిళలు అత్యధిక మెజారిటీతో గెలిచి ప్రజాసేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్ మహిళా మోర్చా డివిజన్ ఉపాధ్యక్షురాలుగా సుప్రజ, రెడ్డమ్మ,లావణ్య, జనరల్ సెక్రటరీలుగా పద్మజ, మంజు, సెక్రటరీ నాగమణి, బుజ్జమ్మ, ట్రెజరర్ అంజలి, అండాలమ్మ ఎగ్జిక్యూటివ్ నెంబర్లు గా నియమిస్తు నియామకం పత్రాలను రవికుమార్ అందజేశారు.



## ప్రమాదంలో గాయపడ్డ కిర్బీ కార్మికులను పరామర్శించిన ఎమ్మెల్యే

పటాన్ చెరు, డిసెంబర్ 10 (ప్రభాత ఉదయం): రోడ్డు ప్రమాదంలో గాయపడిన కిర్బీ పరిశ్రమ కార్మికులను పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పరామర్శించారు. గురువారం ఉదయం మొదటి షిఫ్ట్ కి బయలుదేరి వెళ్తున్న కిర్బీ పరిశ్రమ కార్మికుల బస్సు గిద్దలూరు సమీపంలో ప్రమాదానికి గురైంది.సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కార్మికులు చికిత్స పొందుతున్న పటాన్చెరులోని అమేధ ఆసుపత్రికి వెళ్లి కార్మికులను పరామర్శించారు. వైద్యులతో చర్చించి కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన కార్మికులందరూ క్షేమంగా ఉన్నారని ఆయన తెలిపారు.



## ఏడు నుండి 18 డివిజన్లుగా శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి : డిశంబర్ 10, (ప్రభాత ఉదయం) గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 300 డివిజన్ల ఢీ లిమిటేషన్ ముసాయిదా విడుదల చేశారు. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలో శేరిలింగంపల్లి, చందానగర్ జంట సర్కిళ్లలోని ఏడు డివిజన్లు 18 డివిజన్లుగా మారనున్నాయి. అధికారులు డివిజన్ ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గతంలో ఉన్న 7 డివిజన్ల స్థానంలో ప్రస్తుతం 18 డివిజన్లుగా శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లను విభజించనున్నారు. గతంలో గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, కొండాపూర్, హఫీజ్పేట్, మాదాపూర్, మియాపూర్, చందానగర్ డివిజన్లు ఉన్న విషయం తెలిసిందే. వీటి స్థానంలో గచ్చిబౌలి, నల్లగండ్ల, శేరిలింగంపల్లి, మజీద్ బండ, శ్రీరామ్ నగర్ కాలనీ, అంజయ్య నగర్, హైటెక్ సిటీ , మాదాపూర్, ఇజ్జత్ నగర్, కొండాపూర్, మాతృశ్రీ నగర్, ఆఫీస్ పెట్, మదీనాగూడ, చందానగర్, దీప్తి శ్రీనగర్, మియాపూర్, బి కే ఎనక్లేవ్, మయూరి నగర్ డివిజన్లుగా విభజించి ముసాయిదా రూపొందించారు. ఈ ముసాయిదాపై తుది నిర్ణయం వెలువడవలసి ఉంది. ఈ ముసాయిదాపై ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణకు 7 రోజుల గడువు ఇచ్చారు.

## ఉస్మానియా వర్సిటీకి వెయ్యి కోట్లు

**మొదటి పేజీ తరువాయి...**

కొంతమంది తనతో అన్నారని గుర్తుచేశారు. మీరిచ్చే సూచనలు, మేధావులు ఇచ్చే సలహాలతో ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. విద్యార్థులకు తమ ప్రభుత్వం అండగా ఉండాలనే ఓ ఆలోచనతో ఇక్కడకు వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ధైర్యంతో కాదని.. విద్యార్థుల గుండెల నిండా ఉన్న అభిమానంతో ఆర్ట్స్ కాలేజీ వద్దకు వచ్చానని వ్యాఖ్యానించారు. తమ ప్రసంగాలు చదువుకొని కాదని.. తన మనసులో ఉన్నది చెప్పాలని ఇక్కడకు వచ్చానని చెప్పుకొచ్చారు. పురాతన యూనివర్సిటీలో ఉస్మానియా ఒకటని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీకి గొప్ప చరిత్ర ఉందని అభివర్ణించారు. ఇక్కడకు రావాలంటే ధైర్యం కాదని.. అభిమానం కావాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చదువు లేకున్నా ఆధిపత్యాన్ని సహించరని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతానికి ఒక చైతన్యం, పౌరుషం ఉంది. ఎందరో ఓయూ విద్యార్థులు రాష్ట్రం కోసం ఆయుధాలతో అడవిబాట పట్టారు. గద్దర్, జార్జిరెడ్డి, పీవీ నరసింహారావు వంటి ఎంతోమంది ప్రముఖులను ఈ యూనివర్సిటీ ఇచ్చింది. బడికి వెళ్లని ఓ పేదింటి బిడ్డ అందెశ్రీ.. జయజయహే తెలంగాణ నినాదాన్ని అందించారు. సమాజానికి ఏ సమస్య వచ్చినా ఈ యూనివర్సిటీ విద్యార్థులు కదం తొక్కారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఎవరి ఆస్తిలో వాటా అడగలేదు.. కేవలం స్వేచ్ఛ, సమాన అవకాశాలు మాత్రమే అడిగారు. మీరు ఎదిగేందుకు ఈ ప్రభుత్వం స్వేచ్ఛను ఇస్తుంది. ప్రపంచానికే మీరు దిక్సూచిగా మారాలి. నాకు భాష సరిగా రాకపోవచ్చు.. కానీ పేదవాడిని అర్థం చేసుకునే భాష వచ్చు. పేదవాడి బిడ్డ చదువుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో నాకు తెలుసు. పేదలు, నిస్సహాయులకు అండగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. నేను ఫాంహౌస్‌లు కట్టించుకోలేదు.. సాధారణంగానే ఉన్నా. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మీ సోదరుడిగా ఈ ఆర్ట్స్ కాలేజీ ముందు నిలుచున్నా. చరిత్రలో సజీవంగా నిలబడే కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నా. జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్నాం. విద్య ఒక్కటే మన ఆత్మగౌరవాన్ని పెంచుతుందన్నారు.



## జవహర్ నగర్‌లో ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి (జవహర్ నగర్ సర్కిల్) జవహర్ నగర్ లో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ రైట్స్ కౌన్సిల్ ( సి జే ఎ ఫ్ ఐ సి ఆర్ సి ) తెలంగాణ రాష్ట్ర చైర్మన్ చెరుకు రమేష్ ఆధ్వర్యంలో సి జే ఎఫ్ ఐ సి ఆర్ సి ఫౌండర్ డాక్టర్ దివాస్లామ, నేషనల్ చైర్మన్ షౌకత్ మీర్జా, గుజరాత్ యూత్ ప్రెసిడెంట్ సయ్యద్ ముజమిన్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రంగా శ్రీనివాస్ గౌడ్, ఉమెన్ అధ్యక్షాలు లక్ష్మీ శ్రావణి, తెలంగాణ రాష్ట్ర బృంద సభ్యులు, కుల సంఘాలు, రాజకీయ నాయకులు మీడియా మిత్రులు పలువురు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని నిర్వాహకులు తెలిపారు.



గుండం బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తిరు కళ్యాణోత్సవంలో ఆలయ నిర్వాహకులు

## అల్వాల్‌లో గుండం శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) డిసెంబర్ 10 ( ప్రభాత ఉదయం): గుండం బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం దేవుని అల్వాల్ లో బుధవారం బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు శ్రీవారికి ధ్వజారోహణ నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి తిరు కళ్యాణోత్సవం గురువారం రాత్రి 8 గంటలకు అత్యంత వైభవంగా జరుపుకుంటారని ఆలయ నిర్వాహకులు చెప్పారు. ఏర్పాట్లు చేసినట్టు కళ్యాణ ఉత్సవంలో పాల్గొ ను భక్తులు కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పూజా కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు గుండం బాలాజీ అర్చకుని సంప్రదించాలని వారు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో వంశ పారంపర్య ధర్మకర్తలు పరాంకుశం మాధవాచార్యులు పరాంకుశం కృష్ణమాచార్యులు కుటుంబ సభ్యులతో పాటు పెద్ద ఎత్తున స్థానికులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## బస్సులో బంగారు నగలతో బ్యాగ్ పోగొట్టుకున్న మహిళ

### దొరికిన బ్యాగ్ పోలీసులకు అప్పగించిన మరో మహిళ

### అభినందించిన పోలీసులు

పటాన్ చెరు, డిసెంబర్ 10 (ప్రభాత ఉదయం): బొల్లారం నుండి హన్మకొండ వెళ్తున్న బస్సు లో నగలతో పాటు, డాక్యుమెంట్ లు ఉన్న బ్యాగ్ ను ఓ మహిళ పోగొట్టుకుంది. ఉదయం 5 గంటలకు ఆర్టీసీ బస్సు ఎక్కిన కవిత అనే మహిళ బస్సులో కూర్చొని తన భుజానికి ఉండాల్సిన హ్యాండ్ బ్యాగ్ కనిపించక పోయేసరికి బస్సులో కొద్ది దూరం ప్రయాణం చేసాక బస్సులో వెతికిన దొరకక పోయేసరికి పోలీస్ స్టేషన్ కు వచ్చి పిర్యాదు చేసింది. బ్యాగ్ లో 4 తులాల బంగారం మరియు పాసుబుక్ లు ఉన్నాయని పిర్యాదు చేయగా బొల్లారం పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలిన మొదలు పెట్టారు. అదే సమయంలో బ్యాగ్ దొరికిన బొల్లారం కు చెందిన మంజుల అనే మహిళ బ్యాగ్ లో గల కవిత ఫోన్ నెంబర్ కు ఫోన్ చేసి బ్యాగ్ దొరికిన విషయం తెలిపి పోలీస్ స్టేషన్ కు వచ్చి 4 తులాల బంగారం(5 లక్షలు విలువైన) గల బ్యాగ్ ను కవిత కు అందజేయడం జరిగింది.బంగారం దొరికిన బ్యాగ్ ను తిరిగి అందజేసినందుకు మంజులను బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం రవీందర్ రెడ్డి అభినందించారు.



మల్కాజిగిరి లో జర్నలిస్టుల మహాసభ పోస్టర్ ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

## జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( మల్కాజిగిరి నియోజకవర్గం ) డిసెంబర్ 10 ( ప్రభాత ఉదయం ):- జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని మల్కాజిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు మరి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 3వ మహాసభ మల్కాజిగిరి నియోజకవర్గం నెరేడ్ మెట్ లో ఈ నెల14న జరగనున్నాయని యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. మహాసభ విజయవంతంగా జరగాలని ఆశిస్తున్నాను అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ జేఎఫ్ జిల్లా కన్వీనర్ జి హరి ప్రసాద్, కో కన్వీనర్ పి మల్లేష్ గౌడ్, సీనియర్ జిల్లా నాయకురాలు రోజా రాణి, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

## స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు వేల కోట్లు

**మొదటి పేజీ తరువాయి...**

చెప్పుకొచ్చారు సీఎ రేవంత్‌రెడ్డి.'గూగుల్, ఆపిల్, అమెజాన్, టెస్లా, ఫేస్‌బుక్ ఇలాంటి గొప్ప ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. గత 25 సంవత్సరాల్లో సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్‌లో చాలా స్టార్టప్స్ పెద్ద కంపెనీలుగా ఎదిగాయి. తెలంగాణ రైజింగ్ విజన్ స్టార్టప్స్ కోసం మీ ప్రణాళికలు ఏంటని అడిగితే... స్టార్టప్స్‌ని ఫుట్‌బాల్ ఆటతో పోలుస్తాం. నేను ఆ ఆట ఆడతాను. ఫుట్‌బాల్‌లో సమష్టి కృషి అవసరం. పట్టుదలతో సాధన చేయాలి. ఇది టీమ్ వర్క్. కానీ చివరకు గెలుపు చాలా ముఖ్యం. స్టార్టప్స్ కూడా అదే విధంగా ఉండాలి. ఈ రోజు నుంచి హైదరాబాద్ ప్రోడక్ట్ బేస్డ్ స్టార్టప్స్, ఇన్నోవేటివ్ స్టార్టప్స్, ఐపీ ఇంటెన్సివ్ స్టార్టప్స్ వీటి పైనే దృష్టి పెట్టాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు.'హైదరాబాద్ కేవలం స్టార్టప్స్ హబ్‌గా ఎదగడమే కాదు. ఆ కంపెనీలు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నాం. కనీసం 1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన కంపెనీలుగా ఎదగాలి. 2034 నాటికి వాటిల్లో కనీసం 10 సూపర్ యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి. అందుకోసం రాష్ట్రంలో ఒక మంచి ఎకోసిస్టమ్‌ను సృష్టించాలనుకుంటున్నాం. తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ మీకు అవసరమైన సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నాయి. స్టార్టప్‌ల కోసం మా ప్రభుత్వం రూ. 1000 కోట్లతో స్టార్టప్స్ ఫండ్ ఏర్పాటు చేస్తుంది. ఆ ఫండ్స్‌ను వినియోగించుకోండి. తద్వారా స్టార్టప్‌లు గూగుల్ స్థాయిలో లేదా 1 బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదగాలని కోరుకుంటున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహించే ప్రతి అధికారి
# జాగ్రత్తగా వ్యవహరించాలి: కలెక్టర్ నారాయణరెడ్డి



ఓటర్ బాక్స్ ను సిబ్బందికి అందజేస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి



ఎన్నికల అధికారుల పట్టికను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి



పోలింగ్ కేంద్రాలకు అధికారులు, సిబ్బంది వెళ్లడానికి సిద్ధంగా ఉన్న వాహనాలు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 10(ప్రభాత ఉదయం) గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం జరగనున్న మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శంషాబాద్ జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎలక్షన్ మెటీరియల్ పంపిణిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. మైక్రో అబ్జర్వర్ లతో మాట్లాడి పలు సూచనలు చేసారు. ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బంది నిర్వహించే వారి విధులను క్షుణ్ణం గా వివరించారు.ఈ కార్యక్రమంలో రాజేందర్ నగర్ ఆర్డీవో వెంకట్ రెడ్డి, శంషాబాద్ తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మున్ని, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీపై అనుచిత వాక్యాలు చేసిన

# ఎమ్మెల్యే కడియం శ్రీహరి క్షమాపణ చెప్పాలి

### బొడ్డు కరుణాకర్ ఇంటి పై బిఆర్ఎస్ గుండాలు దాడికి ప్రయత్నించిన వారిని అరెస్టు చేయాలి

### సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 10 (ప్రభాత ఉదయం) : సిపిఎం పార్టీ లింగాల ఘనపురం మండల కార్యదర్శి బొడ్డు కరుణాకర్ ఇంటి పైకి బిఆర్ఎస్ గుండాలు వచ్చి దాడికి ప్రయత్నించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, సిపిఎం పార్టీ పై అనుచిత వాక్యాలు చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి క్షమాపణ చెప్పాలని సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలో సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ సోమవారం జనగామ జిల్లాలోని చిల్పూర్ మండలం కిష్టాజిగూడెం గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సిపిఎం పార్టీ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సిపిఎం పార్టీకి మరియు పార్టీ శ్రేణులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కడియం శ్రీహరి మొదటగా టిడిపిలో ఉండి టిఆర్ఎస్ కు పోయి టిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరి పార్టీలు మారుస్తూ కడియం శ్రీహరి సిపిఎం పార్టీ ఓటుతో గెలిచి సిపిఎంను విమర్శించడం సరియైన పద్ధతి కాదన్నారు. సీనియర్ రాజకీయ వేత్తగా ఉండి తన స్థాయిని మర్చి పోయి నిరంతరం ప్రజా సమస్యల పై పోరాటం చేసే విప్లవ పార్టీని, ఆ పార్టీ కార్యకర్తలపై ఇష్టం వచ్చినట్లు విమర్శించడం సరైంది కాదన్నారు. అధికారం శాశ్వతం కాదని గౌరవాన్ని కాపాడుకునే విధంగా



విలేకరుల సమావేశం లో నట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వేస్లీ

భాష ఉండాలని అదేవిధంగా గౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తన రాజకీయ జీవితం ఎదుగుదలలో సిపిఎం పార్టీ సహకారం ఉందన్నారు. అది మరిచిపోయి సిపిఎం పార్టీ కార్యకర్తలను గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కించ పరిచే విధంగా మాట్లాడడం మానుకోవాలన్నారు. లింగాల ఘనపురం మండలం సిరిపురం గ్రామంలో సిపిఎం మండల కార్యదర్శి ఇంటి పైకి వచ్చి కుటుంబం పై దాడి చేసిన బిఆర్ఎస్ గుండాలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నీవు కాంగ్రెస్కు ఎందుకు మద్దతు ఇస్తున్నావని బూతులు తిడుతూ అతని భార్య ఉపేంద్ర పై దాడి కి ప్రయత్నించిన కళ్యాణ్, సంజీవ, చిటకూరు మల్లేష్, చిటకూరూ అశ్విని, బండ అశోక్, బర్ల ఐలయ్యతో పాటు కొంత మంది వచ్చి దాడి చేయడం సరైనది కాదన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరు ఎవరికైనా సపోర్ట్ చేసే అవకాశం ఆ పార్టీకి ఉంటుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఓడిపోతా మని భయంతో మండల కార్యదర్శి పై, అయన కుటుంబంపై దాడి చేయడం తో మండల కార్యదర్శి భార్య అయినా బొడ్డు ఉపేంద్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేయడం జరిగింద న్నారు. ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఉపేంద్రను బుధవారం జనగామ జిల్లా ఆసుపత్రిలోజాన్ వెస్లీ పరామర్శించారు. దాడి చేసిన వారి పై పిటిషన్ ఇచ్చిన లింగాల ఘనపురం ఎస్ఐ వారి పై కేసు నమోదు చేయకుండా బిఆర్ఎస్ కు సహకరించే ప్రయత్నం చేస్తున్నాడని వెంటనే ఎస్ఐ ఎన్ఐ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల కోసం పని చేసే సిపిఎం పార్టీ అభ్యర్థు లను గెలిపించాలని ప్రజలకు ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి. అబ్బాస్ మాట్లాడుతూ సిపిఎం నాయకుల పై కార్యకర్తల పై దాడి చేస్తే సిపిఎం చూస్తూ ఊరుకోదని జిల్లా పోలీస్ అధికారులు జిల్లా ఎన్నికల అధికారి వెంటనే చర్యలు తీసుకొని దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం కార్యకర్తలు పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తారని హెచ్చరించారు. సిపిఎం పై దాడి చేసి అణిచి వేయాలని చూసిన ఎంతోమంది కాల గర్భంలో కలిసిపోయారని హెచ్చరించారు. సిపిఎం ఎర్ర జండా దోపిడీ ఉన్నంత కాలం ముందుకే పోతాయితప్పా.. వెనుకడుగు వేయదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్రి అహల్య, సాంబరాజు యాదగిరి, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, సిపిఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, పుత్కనూరి ఉపేందర్, లింగాల ఘనపురం మండల కార్యదర్శి బొడ్డు కరుణాకర్, లింగాల ఘనపురం గ్రామ కార్యదర్శి కృష్ణమూర్తి, గ్రామ నాయకులు బంద్రు చిన్న ఎట్టయ్య, దుర్గి బాబు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# సజావుగా ఎన్నికల నిర్వహణ

### చెక్ లిస్ట్ చూసుకోవాలి ఎన్నికల అబ్సర్వర్ రవి కిరణ్

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 10(ప్రభాత ఉదయం): నేడు జరిగే మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని ఎన్నికల అబ్జర్వర్ రవి కిరణ్,జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. చిల్పూర్, స్టేషన్ ఘనపూర్, లింగాల ఘనపూర్, జాఫర్ ఘడ్, రఘునాథ్ పల్లి మండలాల్లో... రేపు జరగనున్న మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను అబ్సర్వర్ రవి కిరణ్,జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎలక్షన్ మెటీరియల్ పంపిణీ ని పరిశీలించారు. ముందుగా ఘన్పూర్ లోని జడ్పీ పాఠశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి... పోలింగ్ అధికారులకు ఇచ్చిన మెటీరియల్ ని చెక్ చేశారు.పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పా ట్లను అడిగి తెలుసుకున్నారు.మైక్రో అబ్సర్వర్ లతో మాట్లాడి పలు సూచనలు చేసారు. అనంతరం చిల్పూర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వెళ్లి...ఎన్నికల సా మాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బా క్సులను పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారి గా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు.బ్యాలెట్ పత్రాలు జాగ్రత్త గా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలి పారు. డిస్ట్రి బ్యూ షన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు.సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏ ర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజ నం కల్పించాలని... విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా ఉండేలా చూడా లన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, త్రాగునీరు, లైటింగ్, పా ర్కింగ్ ప్రదేశాలు,వచ్చిపోయేదారులలో ఎలాం టి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం రఘునాథ్ పల్లి జడ్పీ సెకండరి స్కూల్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి... పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్సర్వర్ లతో మాట్లాడి రేపు వారి విధులను క్షుణ్ణం గా వివరించారు.పోలింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన భోజన సదుపాయాన్ని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్వయంగా పరిశీలించి.. పోలింగ్ సిబ్బంది కి వడ్డించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో లు వెంకన్న, గోపిరామ్, తహసీల్దార్ లు,ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజల సుభిక్షంగా ఉండాలి

### కాట సుధాశ్రీనివాస్ గౌడ్

### శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవంలో పాల్గొన్న కాట సుధాశ్రీనివాస్ గౌడ్

పటాన్ చెరు, డిసెంబర్ 10 (ప్రభాత ఉదయం): ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్డారం గ్రామ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కాట సుధాశ్రీనివాస్ గౌడ్ స్వామి వారి బ్రహ్మోత్సవానికి హాజరై దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వదించి తీర్ధ ప్రసాదాలను అందజేసారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించారు.

## చికిత్స పొందుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి



గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్10(ప్రభాత ఉదయం)ఆర్థిక సమస్యలు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని వేణుకాలనీలో నివసిస్తున్న రమణారెడ్డి(55) అయిజ మండలం చిన్నతాండ్రపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యా యుడుగా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా రమణారెడ్డి స్నేహితులతో కలసి ఫైనాన్స్, చిట్టీ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఫైనాన్స్ వ్యవహారం, వ్యక్తిగత సమస్యలతో కొన్ని రోజులుగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక సమస్యలు తలెత్తడంతో మనస్థాపం చెందిన రమణారెడ్డి మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహ త్యాయత్నానికి పాల్పడాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విష మంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



# ఎన్నికల సిబ్బందికి భోజన వసతి లేక అవస్థలు



గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 10(ప్రభాత ఉదయం)మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యా యులు, ఉద్యోగులకు బుధవారం మద్యాహ్న భోజన వసతులు లేక ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. గద్వాల, ధరూర్, కేటిదొడ్డి, గట్టు మండలాల్లో ఎన్నికల నిర్వహించేందుకు వెళ్లిన సిబ్బందికి ఆయా మండల కేంద్రాలల్లో సరైన మధ్యాహ్న భోజనం అందక అవస్థలు పడ్డారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు గాను 839 పోలీంగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 2204 మంది పోలిస్ సిబ్బంది, ఇతర అధికారులను కేటాయించారు. కొన్ని మండలాలో మద్యాహ్న భోజన సమయపాలన సక్రమంగా పాటించకపోవడంతో బీపీ, షుగర్ ఉన్న ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడ్డారన్నా రు.



పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రి తరలింపు

# మొదటి విడత ఎన్నికలకు సర్వం సిద్ధం

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 10(ప్రభాత ఉదయం) జోగుళాంబ గద్వాల జిల్లాలోని మొదటి విడతలో జరుగు గ్రామ పంచాయతీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. గద్వాల, ధరూర్, కేటిదొడ్డి, గట్టు మండలలో 106 గ్రామ పంచాయతీలకు గాను 15 గ్రామాలు ఏకగ్రీవం కాగ, 91 గ్రామ పంచాయతీలకు గాను గురువారం ఎన్నికలు జరుగనున్నాయి. పోలింగ్ నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రిని ఆయా మండల కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది తరలించారు. ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ సిబ్బందికి ఆయా గ్రామ పంచాయతీలకు విధులు కేటాయించారు. గద్వాల, ధరూర్, కేటిదొడ్డి, గట్టు మండలాలో 2,204 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. ప్రతి మండల కేంద్రంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేసి, సిబ్బందికి సామాగ్రిని అందజేశారు. సామాగ్రి తరలింపు, పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పోలింగ్ ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్10(ప్రభాత ఉదయం)గ్రామ పంచాయితీ ఎన్నికలను విజయవంతం చేసేందుకు ఆయా విధులు నిర్వహించే అధికారులు పోలింగ్ ను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఆవరణలో గద్వాల మండలానికి సంబంధించిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది తమకు ఇచ్చే పోలింగ్ సామాగ్రిని చెక్ లిస్ట్ లో సరిచూసుకోవాలని, ఏమైనా సామాగ్రి లేకుంటే వెంటనే రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకొస్తే ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామ పంచాయతీలలోని పోలింగ్ స్టేషన్లకు వెళ్లాక ఇబ్బంది పడకుండా పోలింగ్ నిర్వహణకు అవసరమైన ప్రతి ఒక్క వస్తువును ప్రీసైడింగ్ అధికారులు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. స్పెషల్ కౌంటర్ లో బ్యాలెట్ పేపర్స్ తో పాటు పోలింగ్ కు అవసరమైన వివిధ ఫారాలను, కవర్లను, ఇతర



సామాగ్రిని పరిశీలించి తగు సూచనలు చేశారు. పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో రిపోర్టింగ్ చేశాక రూట్ వారీగా సంబంధిత గ్రామ పంచాయతీలకు పోలింగ్ మెటీరియల్ తో వెళ్లేందుకు జోనల్ అధికారులు సహకరిస్తారన్నారు. పోలింగ్ నిర్వహణకు ఇదివరకే శిక్షణ పూర్తి చేసుకున్న ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, ఇతర పోలింగ్ అధికారులకు ఇంకా ఏమైనా



సందేహాలు ఉంటే డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలన్నారు. ప్రీసైడింగ్ అధికారులు సాయంత్రంలోగా తమకు కేటాయించిన ఆయా గ్రామ పంచాయతీల పోలింగ్ కేంద్రాలకు చేరుకొని గురువారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే



అధికారులు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలకు వాహనాల్లో తరలి వెళ్లే సమయం నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసి తిరిగి రిసెప్షన్ కేంద్రానికి వచ్చేవరకు అవసరమైన పోలీస్ బందోబస్తు నియమించినట్లు చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జడ్పీ డిప్యూటీ సీఈవో నాగేంద్రం, గద్వాల ఎంపీడీవో శైలజ, తహసిల్దార్ మల్లికార్జున్, ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అమీన్‌పూర్‌లో పరువు హత్య

### ఇంటికి పిలిపించి హత్య చేసిన యువతి కుటుంబ సభ్యులు



పటాన్ చెరు, డిసెంబర్ 10 (ప్రభాత ఉదయం): మాట్లాడుకుందామని ప్రేమించిన యువకుడిని ఇంటికి పిలిపించి ఏకంగా ఆ యువకుడిని హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ దారుణ సంఘటన సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీరంగూడ సృజన లక్ష్మీ నగర్‌లో జరిగింది. ఈ హత్యలో మృతుడు జ్యోతి శ్రావణ్ సాయి అలియాస్ శివ (20)గా పోలీసులు గుర్తించారు. మృతుడి స్వస్థలం ఆంధ్రప్రదేశ్ లోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు. ప్రస్తుతం కుత్బుల్లాపూర్ లో గది అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. మైసమ్మగూడలోని సెయింట్ పీటర్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బీరంగూడ సృజన లక్ష్మీ నగర్ కు చెందిన శ్రీజ (19), శ్రావణ్ సాయి (శివ) గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ పదవ తరగతి వరకు ఒకే దగ్గర చదువుకున్నారు. ఆ తర్వాత వేర్వేరుగా విద్యనభ్యసిస్తున్నప్పటికీ వీరి మధ్య ప్రేమబంధం కొనసాగింది. ఈ ప్రేమ వ్యవహారం గురించి తెలుసుకున్న శ్రీజ కుటుంబ సభ్యులు, పలుమార్లు వారిని హెచ్చరించినప్పటికీ ఫలితం లేకపోవడంతో వారు ఆగ్రహంతో ఉన్నారు. ప్రేమికులు ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో అమ్మాయి కుటుంబ సభ్యులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. పెళ్లి విషయం మాట్లాడుకుందామని చెప్పి శ్రావణ్ సాయిని బీరంగూడలోని తమ ఇంటికి పిలిపించారు. యువకుడు వారి ఇంటికి చేరుకోగానే మాట్లాడుకునే నెపంతో లోపలికి రప్పించి ఒక్కసారిగా అమ్మాయి తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు కలిసి అతనిపై క్రికెట్ బ్యాట్‌తో దారుణంగా దాడి చేశారు. ఈ దాడిలో శ్రీజ కూడా గాయాలవగా ఆమెకు చికిత్స అందించడంతో ఆమె కోలుకుంది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రావణ్ సాయి మాత్రం అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. దీంతో కంగారు పడి పలు ఆసుపత్రులకు తరలించగా అతడికి అంతర్గత అవయవాలు దెబ్బతినడంతో ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.

**ఘటనపై అమీన్పూర్ పోలీసుల దర్యాప్తు**

పరువు హత్య సమాచారం అందుకున్న అమీన్ పూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పటాన్చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పెళ్లి విషయం మాట్లాడదామని పిలిపించి హత్య చేయడం ఇది ముందుగా రచించిన పథకం ప్రకారం చేసిన హత్యగా పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే అమ్మాయి తల్లిదండ్రులతోపాటు ఈ దాడిలో పాల్గొన్న ఇతర కుటుంబ సభ్యుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. హత్యకు, ప్రేమను వ్యతిరేకించడానికి గల కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బీజేపీ గోల్కొండ గోషామహల్ జిల్లా ఇంచార్జిని సన్మానించిన నాయకులు



వై శ్రీధర్ ను సన్మానిస్తున్న నాయకులు, అభిమానులు



చిన్న నాటి మిత్రులు

బుద్వేల్, డిసెంబరు 10 (ప్రభాత ఉదయం): బీజేపీ గోల్కొండ గోషా మహల్ జిల్లా ఇంచార్జి, రాజేంద్రనగర్ మాజీ కౌన్సిలర్ వై శ్రీధర్ ను బుధవారం వివిధ పార్టీల నాయకులు, చిన్న నాటి మిత్రులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వై.శ్రీధర్ జన్మదినం సందర్భంగా రాజేంద్రనగర్ శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం అవరణలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. వై శ్రీధర్ ను కార్పొరేటర్లు తోకల శ్రీనివాస్ రెడ్డి, మోంగ్ర సంగీత గౌరీశంకర్, ఆల్ యూనివర్శిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ ఎం.శ్రీనివాస్ యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు టి.అంజన్ కుమార్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం. కొమురయ్య, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సులిగె వెంకటేశ్. శ్రీధర్ చిన్న నాటి మిత్రులు జి.చిమన్లాల్, చక్రపాణి, శివకుమార్, నల్లింగ్ రమేశ్. కె. విజయ కుమార్. ఈ వేణుగోపాల్, తెలంగాణ రాష్ట్ర విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామక్రిష్ణ, జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల14న జాతీయ వరి పరిశోధన సంస్థ 10వ వ్యవస్థాపక దినోత్సవం



జాతీయ వరి పరిశోధన సంస్థ



డాక్టర్ ఆర్ ఎం సుందరం

బుద్వేల్, డిసెంబరు 10 (ప్రభాత ఉదయం) : ఈ నెల 14న రాజేంద్రనగర్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐఐఆర్ఆర్) 10వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించనున్నారు.వరి లో 100 రకాలను కనుగొని దేశ వ్యాప్తంగా వరి ఉత్పత్తులను పెంపొందించడానికి ఐఐఆర్అర్ కృషి చేస్తుంది. 65 మంది శాస్త్రవేత్తలతో దేశ వ్యాప్తంగా 45 ఫండెడ్ సెంటర్లు, 100 వాలీంటర్ సెంటర్ లను కలిగి ఉన్న ఐఐఆర్ఆర్ వరి రకాలను కనుగొనడం, ఉత్పత్తులను పెం పొందించడం, పరిశోధన ఫలితాలను రైతులకు చేరవేయడం లో ముందుండి పనిచేస్తుంది. ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న ఐఐఆర్ఆర్ 10వ వ్యవస్తాపక దినోత్సవాల వివరాలను ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్ ఎం సుందరం వివరించారు. ఐఐఆర్అర్ 10వ వ్యవస్థాపక దినోత్సవాలకు భారతీయ వరి పరిశోధన మండలి (ఐసీఏఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (క్రాప్ సైన్సెస్) డాక్టర్ డి కె యాదవ ముఖ్య అతిథిగా హాజరై ఐఐఆర్ఆర్ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ ఎస్ వి ఎస్ శాస్త్రీ మెమోరియల్ లెక్చర్ ను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో గ్వాలియర్ ఆర్ఎస్ కేవీవీ విశ్రాంత వైస్ చాన్సలర్ డాకర్ ఎస్ కె రావు, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్ కె ప్రధాన్ లు పాల్గొంటారన్నారు.

**ఐఐఆర్ఆర్ కు ముందు :**

రాజేంద్రనగర్ లోని ఐఐఆర్ఆర్ కు ముందు ఈ సంస్థను ఆల్ ఇండియ కో ఆర్డినేటెడ్ రైస్ ఇం ప్రూవ్మెంట్ ప్రాజెక్టు (ఎఐసీఆర్ఐపీ) గా పిలిచే వారు. అది 1965 లో ఏర్పడింది. ఆ తర్వాత 1983లో డైరెక్టరేట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ గా మారింది. 2014 నుంచి ఈ సంస్థను ఇండియన్ ఇనిస్టిట్యూట్ అఫ్ రైస్ రీసెర్చ్ (ఐఐఆర్అర్) గా పిలుస్తున్నారని తెలిపారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

### కొడి మహేష్ కురుమ



మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( మేడ్చల్ మున్సిపాలిటీ ) డిసెంబర్ 10 ( ప్రభాత ఉదయం ):- బుధవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు మాజీ కౌన్సిలర్ గౌడ మహేష్ కురుమ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు ఎప్పుడూ అందుబాటులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులని గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామంలోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తారని చెప్పారు. మీకు ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందిస్తూ పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనునిత్యం పరితపించే ప్రజా నాయకులని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని భీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. గత 10 యేండ్ల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలోని ఏ గ్రామాల్లో ఏం అభివృద్ధి చేశారో చూపించాలని గత ప్రభుత్వానికి సవాలు విసిరారు. అలాగే రైతులు పండించిన వరి ధాన్యం కటింగ్ చేసి జూలపల్లి మండల రైతులను మోసం చేసిన ఘనత బి.ఆర్.ఎస్ ప్రభుత్వనిది,వారి నాయకులది అని విమర్శించారు. అలాగే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీలు,సంక్షేమ పథకాల పట్ల,ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు కానీ పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వకుండా ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఉచిత కరెంట్, సన్న బియ్యం, సన్న వడ్లపై బోనస్ కటింగ్ లేకుండా వడ్ల కొనుగోలు చేస్తుందన్నారు. రెండు లక్షల రుణమాఫీ ఆరోగ్య శ్రీ 10 లక్షలకు పెంపు వీటితో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ అన్నారు. ప్రజా ప్రభుత్వం రెండేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలిచి, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ గ్రామ పంచాయతీ ఓటర్లను వేడుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ మూడు సంవత్సరాల పాటు గ్రామ పంచాయతీల కోసం ఎక్కువ నిధులు మంజూరు చేయించుకోగలుగుతారని గుర్తు చేశారు. ఈ నెల 11,14,17వ తేదిలల్లో మూడు విడతలుగా జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలల్లో దయచేసి మీ ఓటును కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు కేటాయించిన గుర్తులపై ఓటు వేయాలని ఆయన కోరారు.



శివరేజీ పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## మైలార్దేవుపల్లి డివిజన్ అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

బుద్వేల్, డిసెంబరు 10 (ప్రభాత ఉదయం): లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి పద్మశాలిపురం మార్గంలో శ్మశానవాటిక పరిసరాలలో రూ.50లక్షలతో చేపట్టనున్న సివరేజ్ డ్రైనేజీ పైపులైన్ పనులను బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జలమండలి రాజేంద్రనగర్ డివిజన్ జనరల్ మేనేజరు సాయిలక్ష్మీ, డిప్యూటీ జనరల్ మేనేజరు రేణుకలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, మైలారేవుపల్లి డివిజన్ లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రూ.10 కోట్లతో సీసీ రోడ్లు, మూడు కోట్లతో డ్రైనేజీ పనులను చేపట్టడానికి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. పనులు నాణ్యతగా చేపట్టేటట్లు అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. నిరంతరం ప్రజల కోసం పనిచేయడానికే ఉన్నానన్నారు. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ. గ్రేటర్ లో పోరాడి డివిజన్ కోసం నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. మైలార్దేవుపల్లి డివిజన్ ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ద్వేయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి

బుద్వేల్, డిసెంబరు 10 (ప్రభాత ఉదయం) : అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మరణించాడు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి... కిషన్ బాగ్ కు చెందిన ఈ యాదయ్య (45) ఎలక్ట్రిషియన్ గా పనిచేస్తాడు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో హైదర్ గూడ వద్ద నుంచి నడుచుకుం టు వెళుతు ఒక్క సారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందిం చారు. పోలీసులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే యాదయ్య మరణించినట్లు డాక్టర్లు తెలి పారు. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




ఈవీఎం గోదాము ను సందర్శించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

## ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

### బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని గదులను పరిశీలించిన కలెక్టర్


బుద్వేల్, డిసెంబరు 10 (ప్రభాత ఉదయం) : రాజేందర్ నగర్ లోని ఈవీఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీలలో భాగంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం సందర్శించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రంగారెడ్డి జిల్లాలోని భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని గదులను కలెక్టర్ నారాయణ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భాంగా కలెక్టర్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ గోదాము సీల్ ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి యంత్రాలను పరిశీలించారు. అనంతరం వారి సమక్షంలో గోదాము సీల్ వేశారు.ఈ కార్యక్రమంలో రాజేందర్ నగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, తహశీల్దార్, వేర్ హౌస్ ఇంచార్జీ బొమ్మ రాములు, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీలు ఎన్.రవి కుమార్, కె. సతీష్ కుమార్, సయ్యద్ సిరాజ్, ఎన్. నర్సింహా రెడ్డి, కె.బాల్‌రాజ్, అర్షద్,అబ్దుల్ బారీ, ఎన్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## శివరాంపల్లిని సులేమాన్ నగర్ డివిజన్‌లో కలుపడం బాధాకరం: తోకల



బుద్వేల్, డిసెంబరు 10 (ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ లో డివిజన్ల పునర్విభజన కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా చేసుకున్నారని మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోకి వచ్చే శివరాంపల్లి బస్తీ ని సులేమాన్ నగర్ డివిజన్ లో కలిపారు. శాస్త్రీపురం డివిజన్ పరిధిలోకి వచ్చే బండ్లగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను మైలారేవుపల్లి డివిజన్ లో కలిపారు. బీజేపీ గత గ్రేటర్ ఎన్నికలలో రాజేంద్రనగర్ సర్కిల్ లోని మూడు డివిజన్లను గెలుచుకున్నాయి. అది చూసి ఓర్వలేక కాంగ్రెస్ మైనారిటీ ఓట్లను కలుపుకుని గెలవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

## గుర్తుతెలియని యువకుడి మృతి




బుద్వేల్, డిసెంబరు 10 (ప్రభాత ఉదయం) : గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం రాత్రి ఆరాంఘర్ చౌరస్తాలో అపస్మారక స్థితిలో ఉన్న గుర్తుతెలియని యువకుడు (30)ను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకుని పోలీసులు గుర్తుతెలియని యువకుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. యువకుడిని ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు డాక్టర్లు దృవికరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608